# శంకరం : పంకజం

"నిరుద్యోగం" నాటకం —

రిహార్సల్స్ జరుగుతున్నాయి.

హైస్కూల్ టీచర్సు కొందరు, ఔత్సాహికులు కొందరు కలిసి ఆంధ్ర నాటక కళా పరిషత్తు ప్రదర్శనాలలో వెయ్యదలచారు.

శంకరం హైస్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచరు. సరదా మనిషి. హీరో వేసే రఘురామ్ అతన్నికూడా చిన్న పాత్ర వెయ్యమని బలవంతం చేశాడు.

శంకరానికి నాటకాల సరదా. చాలా చూశాడు. నాటకంమిద ఖచ్చిత మైన కొన్ని అభిప్రాయాలున్నవాడు. కాని, ఎప్పుడూ నటించాలనే కోరిక లేదు.

ఒక షరతుమీద వేస్తానన్నాడు.

స్త్రీలు స్త్రీపాత్రలు ధరించకూడదు.

నాటకం వాళ్ళంతా నవ్వారు. కూరలో ఉప్పుండకూడదు అన్నంత వెటకారంగా —

శంకరం అంటాడు — "అబ్బాయిలూ ! ఒకటుంది. మగవాడు ఆడవేషం వేస్తే అది నాటకం, ఆడదేవేస్తే అది జీవితం. వృద్ధులు వృద్ధ పాత్రలు. పిల్లలు పిల్లపాత్రలూ వేయమని కోరరు. ఎందుచేత?" రఘు కార్యవాది. వాదించి లాభంలేదనుకున్నాడు.

"ఆల్‌రైట్ - ఆడది నీ పక్కన నటించదు. నువ్వు వెయ్యి శంకరం" అన్నాడు. శంకరం ఒప్పుకున్నాడు.

నాటకంలో — శంకరం ఒక ఆఫీసరు దగ్గర కాంపు క్లార్కు. అతని భార్య సుగుణగా ఒక కుర్రాణ్ని సెలెక్టు చేశారు. చదువుతున్నారు.

ప్రదర్శనం దగ్గర కొచ్చింది.

ఆ రోజు ఫైనల్ రిహార్సల్ —

శంకరం హుషారుగా రంగంమీద కొచ్చాడు.

అతడు ఆఫీసు నుంచి ఇంటి కొచ్చేసరికి భార్య ఎదురుగా వచ్చి పలకరించాలి. శంకరం ఆఫీసు ఫైలు చంకలో పెట్టుకుని ఈలవేస్తూ నాలు గడుగులు వేసి, సైడ్ పీస్‌లోకి చూశాడు.

"ఏమిటండీ మిది మరీ చాదస్తం- ఇంత ఆలస్యమైతే నేనొకర్తనూ ఇంటి దగ్గర వుండలేను బాబూ-"

సైడ్‌పీస్‌లో నుంచి ఒక పదహారేళ్ళ పిల్ల, సంసారపక్షంగా వుంది. కళ్ళు దీపాల్లా వెలుగుతున్నాయి. చిరునవ్వుతో ఒయ్యారంగా డైలాగ్ చెప్పి ఓరగా కళ్ళెత్తి చూసింది.

శంకరం ఉలిక్కిపడి పోర్షన్ మరచిపోయాడు. ఏమి టీనయ వంచన! రఘును చంపుదామన్నంత కోపం వచ్చింది. అతడు కనపడ లేదు.

తర్వాత తేలింది. సుగుణగావేసే కుర్రాడికి చాలా జబ్బు చేసిందిట, పాపం! హఠాత్తుగా — నాటకం ఆగిపోకుండా ఈ పిల్లని వెతికి వెతికి తెచ్చారుట !

తను భీష్మించుకు కూర్చుంటే -ఆప్రతిష్ఠంతా తనమీద పడుతుంది. 'సరే కానివ్వండి.' మనస్సు బిగబట్టుకున్నాడు.

కాకినాడలో ఒక థియేటర్ పక్క లాడ్జి!

నాటకం జట్టు వచ్చి నాలుగ్గదులాక్రమించింది. హీరోయిన్ శారద, సుగుణ వేసే పంకజం, తమ్ముడూ ఒక గదిలో, పక్కగదిలో రఘు, శంకరం - తక్కిన జట్టంతా తక్కిన గదుల్లో ప్రదర్శనానికి కావలసిన హంగామా అంతా చేస్తున్నారు.

ఆ రాత్రి నాటకం జరిగింది. అద్భుతంగా రక్తి కట్టిందన్నారు ప్రేక్షకులు. పరిషత్తువారు 'నిరుద్యోగం' ప్రశంసిస్తూ పెద్ద పాత్రలకు రెండు వెండి కప్పులు, చిన్నపాత్రలకు రెండు రజత పతకాలు బహూకరించారు. వేషమే వద్దన్న శంకరానికో రజత పతకం రావడం విశేషం. అంతా లాడ్జికొచ్చారు.

రఘు శంకరాన్ని అమాంతంగా కౌగిలించుకుని "అద్భుతంగా చేశావు బ్రదర్" అని కుదిపేశాడు. శంకరం నవ్వి ఊరుకున్నాడు - 'మీ ఎత్తులు గుర్తించానయ్యా' అన్నట్టు.

నటులంతా ఎవరిదారిన వారు వెళ్ళారు.

మర్నాడు పరిషత్తు ప్రదర్శనాలలో నృత్యనాటిక చూసి మరీ వెడదామని రఘు, శంకరం, పంకజం, ఆమె తమ్ముడూ ఆగిపోయారు.

నృత్యనాటిక రాత్రి తొమ్మిది గంటలకు ముగిసింది. రఘు ఒక మిత్రుడితో కలిసివెళ్ళి మళ్ళీ వస్తానన్నాడు. పంకజం తమ్ముడు నిద్ర

పోతున్నాడు - శంకరం ఒక్కడూ గదికి వచ్చి బడలికగా కన్నుమూసుకు ఆలోచిస్తున్నాడు.

తలుపు చప్పుడు. తలెత్తి చూశాడు. "ఎవరు ?"

"మీ భార్య సుగుణ లేక పంకజం" గలగల నవ్వింది గాలికి ఊగిన మాలతి తీగనుంచి పువ్వులు రాలినట్టు - శంకరానికి మతిపోయింది. ఊహించని కొత్త నాటకం! నవ్వుతూ అన్నాడు "నాటకాలలో నా లాంటి భర్తలు ఎందరయ్యారో నీకు పంకజం!" నిట్టూర్పు విడిచాడు.

"మీరు పొరబడ్డారు. మీలాగే నాకూ ఇది తొలి నాటకం. ఒక మగవాడికి భార్యగా నటించడం ఇదే మొదలు - ముందు భయమేసింది. తర్వాత మీ అమాయకత్వం, నిజాయితీ చూసి కవ్వించి నటించాను. అది రక్తిగా సాగింది. మీ మీద ఏదో తెలియని ఇష్టం మొదలైంది. రేపు మీరెవరో నేనెవరో- ఒక్కసారి మిమ్మల్ని చూసిపోదామని సాహసించి వచ్చాను. ఒక గంటలో ప్రయాణం" తడి కళ్ళతో దగ్గరగా కూర్చుంది - ఆ ముఖంలో కపటం, మారువేషం కనిపించలేదు.

శంకరం కదిలిపోయాడు. "పంకజం! బలవంతంగా నన్ను నాటకంలో ఇరికించారు. విధిలేక ఒప్పుకున్నాను. నా పోర్షన్ తగలేద్దామనుకున్నాను కాని, నువ్వు హఠాత్తుగా నాగస్వరం ఊదుతూ వచ్చి పడగ ముడుచుకు బుట్టలో పడుకున్న ఈ పామును పొడిచి ఆడించావు. నామనసు పొరలలో దాగివున్న స్త్రీమూర్తి నీలో కనపడింది. ఎన్నాళ్ళ నిద్రలోంచో ఈనాడు మేలుకున్నట్లయింది. నీవు ఎదురుగా వుంటే రెక్కలు విప్పి ఎగరగలను !"

వెలిగే అతని కళ్ళు చూసి పంకజం నవ్వి "వద్దులెండి, ఈ రెండు సపోటా పళ్ళు తినండి, నా చేత్తో ఒలిచిపెడతాను." పళ్ళు ఒలిచి చేతిలో పెట్టబోతూంటే చేయి ఒణికింది. పళ్ళు జారిపోకుండా శంకరం ఆమె నున్నని చేతులు పట్టుకున్నాడు.

"నేను అంటరానిదాన్ని, తాకవద్దనుకున్నాను. బురదలో పుట్టాను. విలవిలా తన్నుకుని నీటిపైకి తేలాను. స్కూలు ఫైనల్ పాసయాను. తండ్రి లేడు. ముసలి తల్లీ, పధ్నాలుగు ఏళ్ళ తమ్ముడూ నాకు మిగిలిన ఆస్తి ఉద్యోగం లేదు, తెలివివుంది. ఈ పడుచుతనం వుంది. దీనితో బతక దలచి వేషానికి ఒప్పుకున్నాను. మీవంటి సంస్కారం గల వ్యక్తితో మొదట వేషం దొరకటం ఒక విధంగా నా అదృష్టం. ఇంకోవిధంగా నా దురదృష్టం! ఇంకొక మగవాడిని నా వాడిగా ఊహించలేను. ఇంక వేషాలు వెయ్యను. ట్యూషన్లు చెప్పుకు బతుకుతాను" తల వంచుకుంది పంకజం.

శంకరం చటుక్కున ఆమె తలను హృదయానికి అదుముకుని, "పిచ్చిదానా, సూర్యకాంతితో వెలిగి, స్వచ్ఛమైన గాలికి రేకులు విప్పుకున్న నిజమైన పంకజానివి నువ్వు— నీ కళాపరిమళం ఈ లోకాన్ని పరవశం చేస్తుంది." చెక్కిళ్ళమీద జారే అశ్రువులు తుడిచాడు.

ఆమె తల వంచుకు వెళ్ళిపోతూవుంటే మజుందార్ చిత్రించిన "లోటస్ ఇన్ ది మడ్" అనే బొమ్మ జ్ఞాపకం వచ్చి శంకరం కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.